

జ్ఞానభూమి పోర్టల్‌లో నమోదు కావాలి

విజయనగరం కలెక్టరేట్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి పోస్టు మెట్రిక్ ఉపకార వేతనం పొందేందుకు ఫ్రెష్, రెన్యువల్ విద్యార్థులు తమ వివరాలతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సాంఘిక సంక్షేమ శాఖ డీడీ వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ కళాశాలల యాజమాన్యాలు తమ వద్ద చదువుతున్న విద్యార్థులంతా పేర్లను నమోదు చేసుకునేలా చూడాలని కోరారు.

ఉత్తరాంధ్రలో ప్రాజెక్టులకు పెద్దపీట

- సుజల స్రవంతిని ముందుకు తీసుకుని వెళ్దాం
- కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు నాయుడు
- వివరాలు వెల్లడించిన కలెక్టర్ రామసుందర్‌రెడ్డి


మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

విజయనగరం కలెక్టరేట్/ సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రలో సాగునీటి ప్రాజెక్టులు అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారని కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి చెప్పారు. సోమవారం రాజధాని అమరావతిలో జరిగిన కలెక్టర్ల కాన్ఫరెన్స్‌కు జిల్లా నుంచి కలెక్టర్ హాజరయ్యారు. ఉత్తరాంధ్రలో అతి కీలకమైన సుజల స్రవంతి ప్రాజెక్టును ముందుకు తీసుకువెళ్తామని సీఎం వెల్లడించారని వివరించారు. ప్రాజెక్టుల భూ సేకరణ సమస్య ఉంటే వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారని తెలిపారు. సంక్షేమ వసతి గృహాల్లో నాణ్యమైన విద్య అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారని, వసతిగృహాలను నిత్యం తనిఖీ చేయాలన్నారని వెల్లడించారు. జీడీపీ పెరుగుదలలో రాష్ట్రంలో జిల్లా మూడో స్థానంలో ఉందని, పరిశ్రమల స్థాపనలో నాలుగో స్థానంలో ఉందని వెల్లడించారని తెలిపారు. ప్రభుత్వ ప్రాధాన్యతా అంశాలపై పూర్తి స్థాయిలో దృష్టి పెట్టాలని సీఎం సూచించారని కలెక్టర్ రామసుందర్‌రెడ్డి తెలిపారు.


హాజరైన కలెక్టర్ రామసుందర్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎస్పీ ఏఆర్ దామోదర్

గంజాయిని నియంత్రిస్తాం

- మహిళల భద్రతపైనా ప్రత్యేక దృష్టి
- ఎస్పీ ఏఆర్ దామోదర్
- బాధ్యతల స్వీకరణ

విజయనగరం క్రైం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గంజాయి రవాణా నియంత్రణ, మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టి సారిస్తామని ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. జిల్లా ఎస్పీగా సోమవారం పోలీసు కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ముందుగా ఎస్పీ కార్యాలయం వద్ద పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ, గంజాయి నిర్మూలనపై పూర్తి దృష్టి సారిస్తామని, సైబర్ క్రైం నియంత్రణ, రహదారి భద్రతకు కూడా ప్రాధాన్యం ఇస్తామన్నారు. అందరి సహకారం, సమన్వయంతో ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తామన్నారు. 2019 ఎన్నికల నిర్వహణలో విజయనగరం జిల్లాలో పనిచేసిన అనుభవం ఉందని, ఇక్కడ పరిస్థితి పట్ల సంపూర్ణ అవగాహన ఉందని చెప్పారు. ఎటువంటి శాంతిభద్రతలు సమస్యా ఉత్పన్నం కాకుండా పటిష్టమైన భద్రతాచర్యలు చేపడతామన్నారు. ఆయనకు ఏఎస్పీలు సౌమ్య లత, జి.నాగేశ్వరరావు, డీపీవో ఏఓ శ్రీనివాసరావు, న్యాయసలహాదారు పరుశురాం, పలువురు డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు శుభాకాంక్షలు తెలిపారు.

అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం

జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలని ఎస్పీ దామోదర్ ఆదేశించారు. జిల్లా పోలీసు అధికారులతో సోమవారం సమావేశమైన ఆయన ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలపై దిశానిర్దేశం చేశారు. గంజాయి అనే పదం జిల్లాలో విన్పించకూడదన్నారు. మహిళల ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని, బాలలపై లైంగిక దాడులు జరగకుండా గుడ్ టచ్, బ్యాడ్ టచ్ పట్ల అవగాహన కల్పించేందుకు ఎంఎస్‌పీలను వినియోగించుకోవాలని సూచించారు.


యూరియా కోసం బారులు 6

మహిళలు ఆరోగ్యంగా ఉండాలని..

- రేపటి నుంచి స్వస్థ్‌నారీ సశక్త్ పరివార్ అభియాన్
- డీఎంహెచ్‌వో జీవనరాణి

విజయనగరం రింగురోడ్డు/ విజయనగరం కలెక్టరేట్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మహిళల ఆరోగ్యాన్ని మెరుగుపరచాలన్న లక్ష్యంతో స్వస్థ్‌నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఈ నెల 17 నుంచి లాంఛనంగా ప్రారంభించనున్నట్టు డీఎంహెచ్‌వో డాక్టరు జీవనరాణి చెప్పారు. సోమవారం తన కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ, ఆయుష్మాన్, ప్రాథమిక పట్టణ ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య శిబిరాలు, అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. శిబిరాల్లో వైద్య సేవలు పొందిన వారి వివరాలను ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయనున్నట్టు తెలిపారు. శిబిరాల్లో ప్రసూతి, చిన్న పిల్లలు, నేత్ర, ఈఎన్‌టీ, దంతం, సైకియాట్రీ, డెర్మటాలజీ, మహిళల్లో హిమోగ్లోబిన్, బీపీ, మధుమేహం, క్యాన్సర్, టీబీ, గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్టు తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో సికిల్‌సెల్ ఎనీమియా పరీక్షలు నిర్వహించి కార్డులు జారీ చేస్తామన్నారు. అలాగే ఆయుష్మాన్ భారత్ ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన కార్డులు, 70 ఏళ్ల దాటిన వారికి వయోవందన కార్డులు జారీ చేసేందుకు వివరాలు నమోదు చేయనున్నట్టు తెలిపారు. చిన్న పిల్లలు, గర్భిణుల్లో ఇమ్యునైజేషన్ టీకాలు వేయనున్నట్టు తెలిపారు. అలాగే బ్లడ్ బ్యాంకుల ద్వారా స్వచ్ఛందంగా రక్తదాన శిబిరాలు, సురక్షిత రక్తసేకరణ, కొత్త రక్తదాతల నమోదు ప్రక్రియను చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమాలు అక్టోబరు 2 వరకూ కొనసాగుతాయని చెప్పారు.



పోస్టర్ ఆవిష్కరణ

మహిళల ఆరోగ్య పరిరక్షణకు స్వస్థ్‌నారీ సశక్త్ పరివార్ అభియాన్ పథకం ఎంతో దోహదం చేస్తుందని జేసీ సేతు మాధవన్ అన్నారు. ఈ పథకానికి సంబంధించిన పోస్టర్‌ను ఆయన కలెక్టరేట్‌లో సోమవారం ఆవిష్కరించారు. ఇదే పోస్టర్‌ను పీజీఆర్ఎస్‌లో డీఆర్‌వో శ్రీనివాసమూర్తి ఆవిష్కరించారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జేసీ సేతుమాధవన్

విస్తరణ.. ఇలానా?

- రాజాం ప్రధాన రహదారి నిర్మాణంపై విమర్శలు
- పనుల్లో నాణ్యతపై అనుమానాలు
- భవనాల గోడలు తొలగించకుండా కాల్వల నిర్మాణం
- పునాదుల్లేకుండా డివైడర్ల పనులు
- నిర్మాణ సమయంలోనే కూలిపోతున్న డివైడర్లు


గోడ, భవనం శ్లాబ్, డూము తొలగించకుండా కాలువ నిర్మాణ పనులు


లోతుగా తవ్వకుండా డివైడర్ల నిర్మాణం

రాజాంలో రెండోవిడత రహదారి విస్తరణ పనులపై అనేక అనుమానాలు వినిపిస్తున్నాయి. నిర్మాణాల నాణ్యతపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఆర్అండ్‌బీ, మునిసిపాలిటీ సంయుక్త పర్యవేక్షణలో పనులు జరగాల్సి ఉండగా అందుకు విరుద్ధంగా ఎవరికివారే యమునా తీరే చందంగా ఆయాశాఖల అధికారులు వ్యవహరిస్తుండడంతో కాంట్రాక్టర్‌కు చెందిన ప్రతినిధులు ఇష్టారాజ్యంగా పనులు జరిపిస్తున్నారన్న విమర్శలు బహిరంగంగా వినిపిస్తున్నాయి.

రాజాం రూరల్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): రాజాం ప్రధాన రహదారి విస్తరణ పనులు జరుగుతున్నందుకు సంతోషించే లోపే లోపాలు బహిర్గతమవుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా.. నాణ్యతకు దూరంగా పనులు చేస్తున్నట్లు స్థానికుల్లో సందేహాలు తలెత్తుతున్నాయి. జూలై చివరి వారంలో రాజాం-డోలపేట మధ్య ఓ వైద్యుడికి చెందిన భవనం వద్ద 80 అడుగులకు బదులు 75 అడుగుల మేర విస్తరించి కాల్వ నిర్మాణం జరిపిన విషయాన్ని అప్పట్లో 'ఆంధ్రజ్యోతి' బహిర్గతం చేసింది. దీంతో రంగంలోకి దిగిన మునిసిపాలిటీ, ఆర్అండ్‌బీ అధికారులు ఆ ఐదు అడుగులు సరిచేసి 80 అడుగులు ఉండేలా తిరిగి నిర్మాణం చేపట్టారు. కానీ పాత భవనాలకు సంబంధించిన నిర్మాణాలు తొలగించలేదు. ఇటు డివైడర్ల నిర్మాణంలోనూ రోడ్డును తవ్వి కాంక్రీట్ వేసి డివైడర్ నిర్మించాల్సి ఉండగా అందుకు విరుద్ధంగా రోడ్డుపైనే డివైడర్ నిర్మిస్తున్నారు. అవి ఎక్కడికక్కడే కూలిపోతుండడం విస్తరణ పనుల (మిగతా 8వ పేజీలో..)

'వాహనమిత్ర'కు మార్గదర్శకాలు విడుదల

- రేపటి నుంచి దరఖాస్తుల స్వీకరణ 6



ఓజోన్‌కు ముప్పు

- పర్యావరణ హిత కార్యక్రమాలతోనే పరిరక్షణ
- నేడు అంతర్జాతీయ ఓజోన్ పొర పరిరక్షణ దినం 6

'మీకోసం' అర్జీలకు సత్వర పరిష్కారం 6

- డీఆర్వో శ్రీనివాసమూర్తి

జీఎంఆర్ ఐటీలో జాతీయ సదస్సు 7

500 మార్కులే లక్ష్యం

- డిప్యూటీ డీఈవో వెంకటరమణ

- ఎంపికైన ఉపాధ్యాయుల తుది జాబితా తాజాగా విడుదల
- భర్తీ అయిన పోస్టులు 578
- ఐదు పోస్టులకు లేని అభ్యర్థులు
- డీఈవో కార్యాలయం వద్ద జాబితా
- 19న నియామక పత్రాలు అందజేత
- 22 నుంచి శిక్షణ



మాస్టార్లు వచ్చేస్తున్నారు


జిల్లా విద్యాశాఖ కార్యాలయం వద్ద నోటీస్‌బోర్డుపై అంటించిన తుది జాబితాను పరిశీలిస్తున్న ఉపాధ్యాయ అభ్యర్థి

విజయనగరం కలెక్టరేట్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీలో భాగంగా ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల తుది జాబితాను సోమవారం విద్యాశాఖ అధికారులు విడుదల చేశారు. ఆ వివరాలు డీఈవో కార్యాలయం వద్ద అందుబాటులో ఉన్నాయి. అలాగే వెబ్‌సైట్‌లోనూ జాబితా పెట్టారు. ఎంపికైన అభ్యర్థులకు ఈనెల 19న సీఎం చంద్రబాబు నియామక పత్రాలు అందజేస్తారు. 22 నుంచి వారికి శిక్షణ ఇవ్వనున్నారు. జిల్లాలో 583 పోస్టులకు నోటిఫికేషన్ విడుదలైంది. 578 పోస్టులను భర్తీ చేశారు. ఐదు పోస్టులకు సంబంధించి ఆ కేటగిరికి చెందిన అభ్యర్థులు లేక భర్తీ చేయలేదు. స్కూల్ అసిస్టెంట్లలో ఇంగ్లీష్ 19, హిందీ 14, తెలుగు 12, జీవ శాస్త్రం19, గణితం 8, ఫిజికల్ ఎడ్యుకేషన్ 62, ఫిజికల్ సైన్సు 32, సోషల్ 58, ఎస్‌జీటీలు 149 పోస్టులు భర్తీ చేశారు. అయితే ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో ఒక పోస్టుకు సంబంధించి బీసీ-సీ కేటగిరికి చెందిన అభ్యర్థి లేక ఆ పోస్టును భర్తీ (మిగతా 8వ పేజీలో..)

జిల్లా వ్యాప్తంగా యూరియా కోసం రైతులు చాలా ప్రయాస పడుతున్నారు. కొద్దిరోజులుగా గంటలు, రోజులు నిరీక్షిస్తున్నారు. రైతులకు ఈ బాధ తప్పించేందుకు ప్రభుత్వం ద్రవరూపంలో 'నానో' యూరియాను అందుబాటులోకి తెచ్చింది. తక్కువ ధరతో పాటు సులభంగా రవాణా చేసుకునేందుకు వీలుంది. రసాయన మందులు మాదిరిగా పిచికారీ చేసుకుంటే చాలని అధికారులు చెబుతున్నారు. ఇదో సులభతరమైన ఎరువు అని కూడా అంటున్నారు.



నానోతో ఊరట

- జిల్లాలో అందుబాటులోకి కొత్త తరహా ఎరువులు
- ద్రవరూపం యూరియా, డీఏపీ మేలంటున్న శాస్త్రవేత్తలు
- సాధారణ ఎరువు కంటే ధర తక్కువ
- సమయం, శ్రమ ఆదా అంటున్న అధికారులు

● వంగర మండలం కొప్పర కొత్తవలసకు చెందిన రైతు అప్పలనాయుడు ఎరువుల కోసం ఎదురుచూశాడు. తాను వేసుకున్న వరి పొలానికి తగ్గట్టు యూరియా దొరకలేదు. దీంతో ఓ అధికారిని సంప్రదించాడు. ఆయన సూచనతో నానో యూరియా వేశాడు. ఈ ఎరువు పనిచేస్తుందో? లేదో? అన్న అనుమానంతో కొద్దిరోజులు గడిపాడు. నేడు వరిపైరు ఏపుగా పెరగడంతో టెన్షన్ పోయిందంటున్నాడు.

రాజాం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి):

జిల్లాలో 2.20 లక్షల ఎకరాల్లో వరి సాగుచేస్తున్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. రైతులు ఎక్కువగా యూరియా, డీఏపీ బస్తాలను కొనుగోలు చేసి పొలాల్లో చల్లుతుంటారు. జిల్లాలో మెట్ట ప్రాంతాలతో పాటు కొండ ప్రదేశాలూ అధికం. దీంతో ఎరువుల బస్తాను అక్కడకు తీసుకెళ్లేందుకు సరైన రవాణా సదుపాయం ఉండదు. రైతులే అతి కష్టమ్మీద తరలించాల్సి ఉంటుంది.పైగా యూరియా ధర కూడా అధికమే. సమయానికి నీటి తడులు అందకపోయినా, నీరు ఎక్కువ అయినా ఎరువు వృథా కావడం ఖాయం. ఈ స్థితి నుంచి ఉపశమనం పొందాలంటే నానో యూరియా ఉత్తమమని నిపుణులు సూచిస్తున్నారు. ప్రస్తుతం బస్తా యూరియా ధర రూ.266. అదే బ్లాక్ మార్కెట్‌లో (మిగతా 8వ పేజీలో..)





మానవ తప్పిదాలతో ఓజోన్ కు ముప్పు

- పర్యావరణ హిత కార్యక్రమాలతోనే పరిరక్షణ
- నేడు అంతర్జాతీయ ఓజోన్ పొర పరిరక్షణ దినం

ఓజోన్ అంటే ...

వాతావరణ పొరల్లో ఓజోన్ అనేది 16 నుంచి 55 కి.మీ. మేర విస్తరించి ఉన్న స్ట్రాటోస్పియర్‌లో ఉంటుంది. భూమి చుట్టూ ఆవరించి ఉండే మొదటి పొర ట్రోపోస్పియర్లోని ఆక్సిజన్ అణువులు రూపాంతరం చెంది స్ట్రాటోస్పియర్లో ఓ3 అణువులుగా మారుతాయి. ఈ ఓ 3ని ఓజోన్ వాయువుగా వ్యవహరిస్తారు. ఈ అణువలన్నీ ఓజోన్ పొరగా ఏర్పడతాయి. సూర్యుడి నుంచి అచ్చే అతినీలలోహిత కిరణాలు భూమిపైకి చేరకుండా అడ్డుకుంటాయి. ఈవిధంగా భూమిపై ఉన్న జీవజాలానికి ఎలాంటి నష్టం కలుగకుండా రక్షణ కవచంలా ఓజోన్ పొర ఉంటుంది.

శృంగవరపుకోట, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): విశాఖ-అరకు రోడ్డుకు ఆనుకుని ఉన్న ఓ తారు పరిశ్రమకు సంబంధించిన పొగ గొట్టం నుంచి ఉత్పత్తి జరుగుతున్నప్పుడల్లా పొగ విపరీతంగా బయటకు వస్తుంది. రోడ్ల నిర్మాణానికి తారు అవసరం. దీని ఉత్పత్తి సమయంలో పొగ వెలువడక తప్పదు. ఈ పొగ.. కార్బన్, సల్ఫర్‌డైయాక్సైడ్‌లను గాలిలోకి పంపిస్తుంది. ఇవి ఓజోన్ పొర క్షీణతకు కారణమవుతున్నాయి.

● ఎయిర్ కండిషనర్లు (ఏసీ) చల్లటి గాలిని అందిస్తాయి. హాయిగా నిద్రపడుతుంది. రిఫ్రిజిరేటర్లు తాగేందుకు చల్లని నీరు ఇవ్వడంతో పాటు ఆహార పదార్థాలు పాడవకుండా చేస్తాయి. ఇవి లేని నివాసాలు దాదాపుగా లేవు. ఇవి ఇచ్చే సౌకర్యం కంటే పర్యావరణానికి చేస్తున్న నష్టం ఎక్కువ. ఎయిర్ కండిషనింగ్ సరిగా పని చేయడానికి అవసరమైన క్లోరోఫ్లోరో కార్బన్లు వాతావరణాన్ని కలుషితం చేస్తున్నాయి. వీటి ఉత్పత్తుల ఖర్చులను తగ్గించుకోనేందుకు ఉపయోగిస్తున్న ప్లాస్టిక్, హానికరమైన లోహాలు ఓజోన్ పొరను క్షీణించేలా చేస్తున్నాయి.

...ఇలా పారిశ్రామిక, గృహ వినియోగ వస్తువులతో పాటు మోటార్ వాహనాలు, విమానాల నుంచి పరిమితికి మించి వాయుకాలుష్యం వెలువడుతుండడంతో ఓజోన్ పొర క్షీణిస్తోంది. ఇదే కొనసాగితే అనేక ఆరోగ్య సమస్యలతో పాటు ప్రకృతి పైనా ప్రభావం చూపుతుంది. చర్మ వ్యాధులు, క్యాన్సర్, శ్వాసకోస సంబంధిత వ్యాధులతో పాటు పంటలు, జలజీవరాశులకు నష్టం కలుగుతుందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భూమిపై గల వాతావరణ పొరల్లో స్ట్రాటో స్పియర్‌లో వాయురూపంలో విస్తరించి ఉండే ఓజోన్ పొర క్షీణత జీవజాలంపై పెను ప్రభావం చూపుతుంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని దాని పరిరక్షణే ధ్యేయంగా ఏటా సెప్టెంబరు 16న ప్రపంచ ఓజోన్ పరిరక్షణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నాం.

దుష్ఫలితాలు ఎలాగంటే...

ఓజోన్ పొర క్షీణిస్తుండడంతో అతినీలలోహిత కిరణాలు భూమిపైకి చేరుతున్నాయి. దీంతో మనుషుల్లో చర్మ సంబంధ వ్యాధులు, రోగ నిరోధక శక్త తగ్గడం, కంటి సంబంధ వ్యాధులు, చర్మ క్యాన్సర్ బారినపడే అవకాశం ఉంది. ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధులు, గుండె నొప్పి, అధిక రక్తపోటు, రక్త సరఫరాలో అంతరాయం, కళ్ల మంటలు, జంతువులపై ఇవి మరింత తీవ్ర పరిణామాలు చూపుతాయి. మొక్కల్లో కిరణజన్య సంయోగక్రియ రేటు తగ్గి మొక్కల ఆహారం తయారీలో ఆటంకాలు ఏర్పడే అవకాశాలు ఉంటాయి. సముద్ర జీవ జాలంపై పరోక్షంగా ఈ ప్రక్రియ ప్రభావితం చూపిస్తుందని పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. ఉష్ణోగ్రతలు పెరిగి భూమి అగ్నిగోళంగా మారడం కూడా దీని ప్రభావమేనని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

● 1987లో క్లోరోఫ్లోరోను నిషేధించినప్పటికీ ఆ వినియోగం షరా మామూలుగానే ఉంటోంది. ఇది ప్రమాద ఘంటికలను మోగిస్తోంది. అపార్ట్‌మెంట్స్, ఇతర నివాస ప్రాంతాలలో కచ్చితంగా 33 శాతం చెట్లు ఉండాలని, సౌరవిద్యుత్‌ను వినియోగించాలని అంతర్జాతీయ స్థాయి నిపుణులు సూచిస్తున్నారు. 2025 ఓజోన్ పొర రక్షణకు నినాదంగా 'సైన్స్ టు గ్లోబల్ యాక్ట్' అని పేర్కొన్నారు.

పంటలకు నష్టం



వ్యవసాయ పంటలకు నష్టం జరుగుతుంది. అతినీలలోహిత కిరణాలతో ఆకుల కణజాలం దెబ్బతింటుంది. కొత్తచిగుర్లు, మొగ్గల పెరుగుదల ఉండదు. మొక్కల రోగ నిరోధక శక్తి తగ్గిపోవడంతో పురుగులు దాడి చేస్తాయి. వ్యాధుల ప్రభావం పెరుగుతుంది. దిగుబడులు తగ్గి రైతులు నష్టపోతారు.

- కె.రవీంద్ర, మండల వ్యవసాయ అధికారి

ఆహార భద్రతకు ముప్పు



బియ్యం, గోధుమ, మొక్కజొన్న వంటి పంటల దిగుబడి తగ్గడంతో ఆహార కొరత ఏర్పడుతుంది. రైతులకు ఆదాయం పడిపోతుంది. అప్పులు పెరుగుతాయి. పశుగ్రాసం తగ్గడంతో పశుపోషణకు సమస్య వస్తుంది. ఆహార పదార్థాల సరఫరా తగ్గడంతో ధరలు పెరుగుతాయి. సామాజిక జీవనంపై ప్రభావం చూపుతుంది. వలసలు పెరుగుతాయి. ప్రభుత్వాలపైన ఆర్థిక భారం పడుతుంది.

- ఎస్ఆర్‌కే రాజు, సహాయ గణాంక అధికారి

క్యాన్సర్ వ్యాధులు పెరుగుతాయి



ఓజోన్ పొర దెబ్బతింటే నేరుగా అతినీలలోహిత కిరణాలు నేరుగా భూమికి చేరుతాయి. ఇదెంతో ప్రమాదకరం. చర్మ వ్యాధులు సంభవిస్తాయి. ప్రధానంగా క్యాన్సర్ వ్యాధిగ్రస్తులు అధికంగా పెరుగుతారు. ఉపరితిత్తులకు ఇన్‌ఫెక్షన్ సోకుతుంది. ఎండలో ఉండడం కుదరదు. చల్లని ప్రదేశాల్లో నివశించాల్సి వస్తుంది.

- డాక్టర్ ఎస్‌వీ సత్యశేఖర్, సివిల్ అసిస్టెంట్ సర్జన్,

గర్భిణులకు రక్షణ కరువు



అతినీలలోహిత కిరణాలు నేరుగా భూమికి చేరితే గర్భిణులపై అధికంగా ప్రభావం చూపుతాయి. కడుపులో ఉన్న బిడ్డలకు రక్షణ కరువవుతుంది. చర్మవ్యాధులు, క్యాన్సర్ వంటి అనారోగ్య సమస్యలకు గురవుతారు. భూతాపం పెరకుండా అవసరమయ్యే చర్యలు చేపట్టేందుకు ప్రజల సహకారం అవసరం.

- డాక్టర్ పొట్నూరు వరలక్ష్మి, గైనకాలజిస్టు

చెట్లను పెంచాలి



ఓజోన్ పొర క్షీణతకు దారి తీసే కారకాలను నిరోధించాలి. ఏసీలు, రిఫ్రిజిరేటర్ల వాడకం తగ్గించాలి. వాహనాల వాడకం పొదుపుగా ఉండాలి. ఓజోన్ పొర క్షీణతతో అతినీలలోహిత కిరణాలు నేరుగా చేరడంతో భూమి, సముద్రంలో నివశించే జీవకరాశులన్నిటికీ నష్టం. సామాజిక అడవుల పెంపకంతో పాటు ప్రతి ఇంటి ఆవరణలలోనూ చెట్లను చెట్లను నాటడం ద్వారా కొంత వరకు పర్యావరణానికి మేలు కలుగుతుంది.

-పిన్నింటిభాస్కరరావు, రసాయన శాస్త్ర అధ్యాపకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఎస్.కోట

చిన్నపిల్లలపై ప్రభావం అధికం



పిల్లల చర్మం సున్నితంగా ఉంటుంది. వారు ఎక్కువగాబయట ఆడుకుంటారు. వారిపై సూర్యకిరణాల ప్రభావం ఉంటుంది. చర్మ, క్యాన్సర్, శ్వాసకోశ తదితర వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉంది. అతినీలలోహిత కిరణాలు పడకుండా చూడాలి. దీనికి ఒక్కటే మార్గం. ఓజోన్ పొర విచ్ఛిన్నం కాకుండా చూడాలి.

- డాక్టర్ సోమశేఖర్, చిన్నపిల్లల వైద్య నిపుణులు



విశాఖ-అరకు రోడ్డులోని తారు పరిశ్రమ నుంచి వస్తున్న పొగ

'వాహనమిత్ర'కు మార్గదర్శకాలు విడుదల



పాలకొండ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వాహనమిత్ర పథకం కింద ఆటో, క్యాబ్ డ్రైవర్లకు రూ.15 వేల చొప్పున ఇచ్చేందుకు మార్గదర్శకాలు జారీ చేసింది. దీనితో జిల్లాలో సుమారు పది వేల మంది ఆటో, క్యాబ్ డ్రైవర్లకు లబ్ధి చేకూరనుంది. రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు ఉచితంగా ఆర్టీసీలో ప్రయాణించే అవకాశం కల్పించడంతో ఆటో, క్యాబ్ కార్మికులు ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిని పరిగణనలోకి తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం వారికి ఆర్థిక భరోసా కల్పించేందుకు నిర్ణయించింది. దసరా కానుకగా వాహనమిత్ర పథకం కింద ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున చెల్లించేందుకు నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలు విడుదల చేసింది.

రేపటి నుంచి దరఖాస్తుల స్వీకరణ

పార్వతీపురం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): వాహనమిత్ర పథకం కోసం ఈ నెల 17వ తేదీ నుంచి గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా దరఖాస్తులను స్వీకరించనున్నట్టు కలెక్టర్ ఎన్.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. అక్టోబర్ 1న వాహనమిత్ర ప్రారంభం కానుందని తెలిపారు. 'సొంత ఆటో కలిగిన డ్రైవర్‌కు ఈ పథకం వర్తిస్తుంది. ఏపీలో రిజిస్ట్రేషన్, డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలి. దరఖాస్తుదారుకు ఆటో రిక్షా, లైట్ మోటార్ వాహనాన్ని నడపడానికి డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలి. ఆటో రిక్షా విషయంలో ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకపోయినా 2025-26 సంవత్సరానికి అనుమతిస్తారు. అయితే ఒక నెలలోపు ఆ సర్టిఫికెట్‌ను పొందాల్సి ఉంటుంది. దారిద్ర్యరేఖకు దిగువన ఉండాలి. దరఖాస్తుదారులు లేదా కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఉద్యోగి/పెన్షనర్‌గా ఉంటే అనర్హులు. పారిశుధ్య కార్మికుల కుటుంబాలకు మినహాయింపు ఉంటుంది. ఇంటి విద్యుత్ వినియోగం నెలకు 300 యూనిట్లు కంటే తక్కువగా ఉండాలి. దరఖాస్తు తేదీకి ముందుకు 12 నెలల సగటున లెక్కిస్తారు. వాహనాలకు ఎటువంటి పెండింగ్ బకాయిలు, చలాన్లు ఉండరాదు. మాగాణి అయితే మూడు ఎకరాలు, మెట్ట అయితే పది ఎకరాల లోపు ఉండాలి. పట్టణ ప్రాంతాల్లో వెయ్యి చదరపు అడుగుల కంటే ఎక్కువ నివాస, వాణిజ్య నిర్మాణం ఉండకూడదని కలెక్టర్ తెలిపారు

ఉపాధ్యాయ వృత్తి అంటే ఎంతో ఇష్టం

- పోలీసు ఉద్యోగాన్ని వదిలేసి వెళుతున్నా
- బొబ్బిలి కానిస్టేబుల్ మాదెం అశోక్



మాదెం అశోక్

బొబ్బిలి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): 'ఉపాధ్యాయ వృత్తి అంటే చాలా మక్కువ. పోస్టుగ్రాడ్యుయేషన్‌తో బీఈడీ చేసిన నేను విద్యార్థులను తీర్చిదిద్దాలన్న సంకల్పంతోనే కానిస్టేబుల్ ఉద్యోగాన్ని వదులుకుని టీచర్‌గా వెళుతునా' అని మాదెం అశోక్ తెలిపారు. బొబ్బిలి పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న అశోక్ 2018లో విధుల్లో చేరారు. రెండున్నరేళ్ల పాటు విజయనగరం స్పెషల్ పార్టీలో పనిచేసిన అనంతరం నాలుగున్నరేళ్ల నుంచి బొబ్బిలిలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. తాజాగా నిర్వహించిన డీఎస్సీలో అశోక్ జోన్-1 ఏపీ సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలలో ఇంగ్లీషు టీజీటీగా ఎంపికయ్యారు. కొత్తవలస మండలం బలిఘట్టం గ్రామానికి చెందిన అశోక్ ఎంఏ, బీఈడీ చేశారు. అతని తండ్రి రమణ టైలర్ వృత్తిలో ఉంటూ 2019లో మృతి చెందారు. తల్లి దేవుళ్లమ్మ ఉన్నారు. అశోక్‌కు భార్య భాగ్యలక్ష్మి, మూడేళ్ల కుమారుడు జోషిత్ నరసింహ ఉన్నారు. భార్య భాగ్యలక్ష్మి ఒంగోలు దగ్గర కొండెపిలో స్టాఫ్‌నర్స్‌గా పనిచేస్తున్నారు. టీచర్‌గా ఉద్యోగం సాధించిన అశోక్‌ను సహచర ఉద్యోగులు, అధికారులు అభినందించారు.

బాధితుల సమస్యలను పరిష్కరించండి



బాధితుల సమస్యలు తెలుసుకుంటున్న ఏఎస్పీ సౌమ్యలత

విజయనగరం క్రైం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పోలీసు స్టేషన్ల పరిధిలో ఫిర్యాదుదారుల సమస్యలను చట్ట పరిధిలో తక్షణమే పరిష్కరించాలని అదనపు ఎస్పీ పి.సౌమ్యలత అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా 32 ఫిర్యాదులను స్వీకరించారు. ఫిర్యాదులపై విచారణ చేపట్టి నివేదిక పంపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సీఐలు ఏవీ లీలారావు, సుధాకర్, ఎస్ఐ రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

'మీకోసం' అర్జీలకు సత్వర పరిష్కారం

- డీఆర్వో శ్రీనివాసమూర్తి



సమస్యలు తెలుసుకుంటున్న డీఆర్వో శ్రీనివాసమూర్తి

విజయనగరం కలెక్టరేట్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' (మీకోసం)లో వచ్చే అర్జీలను సత్వరం పరిష్కరించాలని డీఆర్వో శ్రీనివాసమూర్తి వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అర్జీదారుల నుంచి 162 వినతులు వచ్చాయి. డీఆర్వో శ్రీనివాసమూర్తి, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్లు వెంకటేశ్వరరావు, ప్రమీలాగాంధీలు వీటిని స్వీకరించారు. స్త్రీ శక్తి పథకం వల్ల నష్టపోయిన తమకు నెలకు రూ.5 వేలు పింఛన్ ఇవ్వాలని ఆటో డ్రైవర్లంతా కోరారు. రాజాం మండలం రామినాయుడువలస, అమరామ రైతులకు నకిలీ విత్తనాలు అందజేయడంతో తీవ్ర ఇబ్బందిపడ్డారని, వెంటనే సంబంధిత డీలర్లపై చర్యలు తీసుకోవాలని ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. బాడంగి మండలం పింద్రింగివలసలో రామాలయం నిర్మాణానికి సమకూర్చిన సీజీఎఫ్ ఫండ్స్ అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి స్వాహా చేశారనని, దీనిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని ఆ గ్రామస్థులు కోరారు.

యూరియా కోసం రైతుల బారులు

- అధికారుల తీరుపై అన్నదాతల ఆగ్రహం



గజపతినగరం: భారీ సంఖ్యలో వేచి ఉన్న రైతులు

గజపతినగరం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతులు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు. పీఏసీఎస్ కార్యాలయం వద్ద సోమవారం ఉదయం నుంచే రైతులు బారులు తీరారు. మండలంలోని అన్ని గ్రామాల రైతులకు పీఏసీఎస్ కార్యాలయం వద్ద యూరియా పంపిణీకి సంబంధించి స్లిప్పులను అధికారులు అందజేస్తారని గ్రామాల్లో ఆదివారం రాత్రి దండోరో వేయించారు. దీంతో రైతులు అధిక సంఖ్యలో కార్యాలయానికి చేరుకున్నారు. పీఏసీఎఓస్‌తో పాటు గ్రోమోర్, శివశక్తి ఫెర్టిలైజర్స్‌లో యూరియా అందించేందుకు వ్యవశాయశాఖ ఏవో కిరణ్‌కుమార్ పీఏసీఎస్‌కు చేరుకున్నారు. సిబ్బంది మాత్రం పది గంటల వరకు రాకపోవడంతో రైతు లు సహనం కోల్పోయారు. ఉదయం 7గంటలకు కార్యాలయానికి చేరుకొని క్యూ కడితే ఇంతవరకు పట్టించుకోకపోవడమేంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. పీఏసీఎస్ ఛైర్మన్ లెంక బంగారునాయుడు సర్ది చెప్పే ప్రయత్నం చేసినప్పటికీ ఆయన మాటలను పట్టించుకోలేదు. కొంతమంది జాతీయ రహదారిపై ధర్నాకు దిగుతామని పరుగులు తీశారు. దీంతో పోలీసులు రైతులను నిలువరించారు. టీడీపీ నాయకులు, రైతుల మధ్య కొంతసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. కుర్చీలు విరిచి పీఏసీఎస్‌లోకి చొరబడే ప్రయత్నం చేశారు. దీంతో అధికారులు స్లిప్పుల పంపిణీ నిలిపివేశారు. ఇంతలో బొబ్బిలి ఆర్డీవో జీవీఎస్ఎస్ రామ్మోహనరావు యూరియా పంపిణీపై ఆరా తీసారు. దీంతో పలువురు రైతులు యూరియా అంద డంలేదని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం శివశక్తి ఫెర్టిలైజర్స్ వద్దకు స్లిప్పులు తీసుకొని వెళ్లినా రైతులకు అక్కడా కష్టాలు తప్పలేదు. ఏడీఏ ఎ.నిర్మలజ్యోతి పర్యవేక్షణలో యూరియా అందించారు.

శివశక్తి ఫెర్టిలైజర్స్ లైసెన్స్ రద్దు

శివశక్తి ఫెర్టిలైజర్స్‌లో ఏడీఏ నిర్మలాజ్యోతి స్టాక్ రికార్డులు పరిశీలించగా... 42 బస్తాలు తక్కువగా ఉన్నట్టు తేలింది. షాపులో 222 బస్తాల యూరియా నిల్వ ఉండాలి. కానీ 180 బస్తాలు మాత్రమే ఉన్నాయి. మిగిలిన 42 బస్తాలు పక్కదారి పట్టినట్టు గుర్తించారు. దీంతో షాపు లైసెన్స్ రద్దు చేయనున్నట్టు తెలిపారు. అనంతరం పోలీసుల సమక్షంలో రైతులకు యూరియా పంపిణీ చేశారు.

గంట్యాడలో...



గంట్యాడ: కొటారుబిల్లి రైతు సేవా కేంద్రం వద్ద..

గంట్యాడ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) యూరియా కోసం రైతులు నానా యాతన పడుతున్నారు సోమవారం కొటారుబిల్లి, కొర్లాం రైతు సేవా కేంద్రాల వద్ద అన్నదాతలు బారులు తీరారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ రైతులు 1బి, ఆధార్ కార్డుల జెరాక్స్‌లు తీసుకుని క్యూలైనుల్లో వేచి ఉండాల్సి వచ్చింది. ప్రతి రైతుకు ఒక్కొక్క బస్తా చొప్పున అందజేశారు.

శృంగవరపుకోటలో...

శృంగవరపుకోట, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట పట్టణంలోని ఓ ప్రైవేటు ఎరువుల దుకాణం వద్ద సోమవారం యూరియా కోసం రైతులు వరస కట్టారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు యూరియా పంపిణీ చేశారు. తహసీల్దార్ డి.శ్రీనివాసరావు, వ్యవసాయ అధికారి కె.రవీంద్ర దగ్గరుండి ప్రతి రైతుకు యూరియా అందేలా చూశారు.

రేగిడి మండలంలో..

రేగిడి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఎరువుల కోసం సోమవారం కూడా రైతులు పడిగాపులు కాశారు. సరసనాలపల్లి, లింగాలవలస, నాయిరాలవలస గ్రామాల్లో సోమవారం వ్యవసాయశాఖ పంపిణీ చేసిన ఎరువులు సరిపోకపోవడంతో రైతులు ఇబ్బంది పడ్డారు. ఈ మూడు గ్రామాల్లో తహసీల్దార్ కృష్ణలత, ఏఓ శ్రీనివాసరావు పరిశీలించి... ఎరువుల కొరత లేకుండా చేస్తామని రైతులకు తెలిపారు.



నాయిరాలవలసలో వేచి ఉన్న రైతులు



ఎస్.కోట: ఎరువుల దుకాణం వద్ద ..

అందుబాటులో యూరియా నిల్వలు

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విజయనగరం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రైతులకు సరిపడా యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని.. ఈ విషయంలో ఎటువంటి దుష్ప్రచారాలను నమ్మవద్దని రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. రైతులకు అవసరమైన నిల్వలు సిద్ధంగా ఉంచామన్నారు. తాజాగా గజపతినగరంలో జరిగిన సంఘటన దురదృష్టకరమని అన్నారు. కొందరు కావాలని చేస్తున్న ప్రచారాన్ని నమ్మవద్దని రైతులకు పిలుపునిచ్చారు. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి.. యూరియాపై జరుగుతున్న అసత్య ప్రచారాన్ని రైతులకు వివరించాలన్నారు. ఈ సీజన్‌లో ఇప్పటి వరకూ 29,574 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు అందించినట్టు తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో 700 మెట్రిక్ టన్నుల యూరియా ఆర్ఎస్‌కేలు, ప్రైవేటు వ్యాపారుల వద్ద సిద్ధంగా ఉందని తెలిపారు. ఇది జిల్లా అవసరాలకు సరిపడుతుందని పేర్కొన్నారు. రైతులు షాపుల వద్ద క్యూలైన్లో వేచి ఉండనవసరం లేదని తెలిపారు. యూరియా బ్లాక్ మార్కెట్‌కు తరలకుండా అధికారులు ఆకస్మిక తనిఖీలు వంటివి నిర్వహిస్తున్నారన్నారని తెలిపారు. జిల్లాకు త్వరలో 1,180 మెట్రిక్ టన్నుల యూరియా రానుందన్నారు. యూరియా కొనుగోలు, అమ్మకాల ప్రక్రియను అధికారులు నిత్యం పర్యవేక్షించాలని ఆదేశించారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు తప్పనిసరి

డెంకాడ, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): పాడి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణా టీకాలు తప్పనిసరిగా వేయించాలని ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖరరావులు పిలుపునిచ్చారు. మండలంలోని అక్కివరం, వెదుళ్లవలస, రఘుమండ, పినతాడివాడ గ్రామాల్లో పశు సంవర్థక శాఖ ఆధ్వర్యంలో గాలికుంటు వ్యాధి నివారణా టీకాలు వేసే కార్యక్రమాన్ని సోమవారం వీరు ప్రారంభించారు. పశువైద్యాధికారి శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

● కొత్తవలస: పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు సోమవారం నుంచి అక్టోబరు 15వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో టీకాలు వేస్తామని కొత్తవలస పశు సంవర్థక శాఖ ఏడీ టీటీఎం కన్నంనాయుడు తెలిపారు. నాలుగు నెలలు వయస్సు దాటిన అన్ని పశువులకు ఈ టీకాలను వేయాలని సూచించారు.

19న నాదారాధన సంగీత పోటీలు

విజయనగరం బాబామెట్ట, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): నగరంలోని రోటరీ దశగీపేర్రాజు మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో ఈనెల 19న నాదారాధన సంగీత పోటీలు నిర్వహించనున్నట్టు అకాడమీ ప్రిన్సిపాల్ డా.మండపాక రవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీనియర్ విభాగంలో 18 ఏళ్లు పైబడిన వారు, జూనియర్స్ విభాగంలో 12 నుంచి 18 ఏళ్ల వరకూ, సబ్ జూనియర్ 8 నుంచి 12 ఏళ్ల వరకూ ఈ పోటీలు నిర్వహించనున్నట్టు తెలిపారు. దరఖాస్తులు ఈనెల 19న సాయంత్రం 5 గంటల లోగా అందించాలన్నారు. మరిన్ని వివరాలకు 94410 42236 నెంబరును సంప్రదించాలని తెలిపారు.

కల్వర్టు పనుల ప్రారంభం

సంతకవిటి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): గరికపాడు గ్రామం వద్ద శిథిలావస్థకు చేరిన కల్వర్టు ఇటీవల కుంగిపోయింది. దీంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. విషయం తెలిసిన ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ ఈ కల్వర్టుతో పాటు మరో మూడు కల్వర్టులకు నిధులు మంజూరు చేయించారు. గత నెల 25వ తేదీన వీటికి శంకుస్థాపన చేశారు. ఈ కల్వర్టు పనులు సోమవారం ప్రారంభమయ్యాయి. దీంతో ప్రయాణికులు ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు.

రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదు

లక్కవరపుకోట, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో నానా అవస్థలు పడుతున్నారని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి బోని కృష్ణ అన్నారు. దళిత రణభేరికి సంబంధించి సోమవారం ఎల్.కోటలో పోస్టర్ విడుదల చేశారు. ఎరువులు, విత్తనాలు అందించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై దృష్టి

గుర్ల, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతిలో 'అధ్వానంగా ఆనందపురం' అనే శీర్షికన సోమవారం వెలువడిన కథనానికి అధికారులు స్పందించారు. ఆనందపురం గ్రామ పరిసరాలను ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది పరిశీలించారు. వీధి వాసులతో మాట్లాడి, చెత్తాచెదారం లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇన్‌చార్జి గ్రామ కార్యదర్శి సాయి గ్రామంలో పర్యటించి, పారిశుధ్య పరిస్థితులపై ఎంపీడీవో రవి కుమార్‌కు నివేదిక అందజేస్తామన్నారు.

ముఖ్యమంత్రికి నివేదిక ఇవ్వండి



నిరసన చేస్తున్న జిందాల్ నిర్వాసితులు

శృంగవరపుకోట రూరల్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లాకు నూతనంగా వచ్చిన కలెక్టర్ రామసుందరరెడ్డి జిందాల్ నిర్వాసితుల సమస్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి ప్రత్యేక నివేదిక అందించి న్యాయం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్ కోరారు. ఈ మేరకు సోమవారం బొడ్డవర గ్రామంలో నిరసన చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంటనే జీవో నెంబరు 14ని రద్దు చేయాలని, తమ భూములు తమకు కేటాయించాలని కోరారు. అలాగే కలెక్టర్ రామసుందరరెడ్డి నిర్వాసితుల తరపున ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాధితులు, రైతు సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

వైద్యం కోసం క్యూ



ఆసుపత్రి వద్ద లైన్‌లో ఉన్న రోగులు

శృంగవరపుకోట, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రి వద్ద వైద్యం కోసం సోమవారం రోగులు క్యూ కట్టారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఓపీ వద్ద చీటీలు రాయించుకునేందుకు వచ్చిన రోగులతో ఆసుపత్రి ఆవరణ కిటకిటలాడింది.

ఘనంగా ఇంజనీరింగ్ దినోత్సవం

డెంకాడ, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): డెంకాడలోని ఎంవీజీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం ఇంజనీర్స్ దినోత్సవం నిర్వహించారు. ఇంజనీరింగ్ ఇన్నోవేషన్ ఫీచర్ ఆఫ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మైక్రోసాఫ్ట్ ప్రొడక్ట్ మేనేజర్ మనూ కపూర్ ముఖ్యఅతిథిగా పాల్గొని, వేడుకలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ-1 యుగంలో కేరీర్ వృద్ధికి, ఆవిష్కరణలకు నైపుణ్యాలు అత్యంత ముఖ్యమన్నారు. అనంతరం ఆయన్ని ప్రిన్సిపాల్ డా.వైఎంసీ శేఖర్ ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డా.ఎం.సునీల్ ప్రకాష్, ఎంవీవీ భాను, ఎంవీజీఆర్ కో-ఆర్డినేటర్ కృష్ణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

● విజయనగరం రింగురోడ్డు: ఆధునికత మనుగడకు ఇంజనీర్లే కీలకమని జిల్లా లైసెన్స్ టెక్నికల్ పర్సన్ అధ్యక్ష, కార్యదర్శులు ఐ.ఆదినారాయణ, అల్తి శ్రీనివాసరావులు అన్నారు. నగరంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో సోమవారం ఇంజనీర్స్ డే నిర్వహించారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అసోసియేషన్, ఆల్ట్రాటెక్ ప్రతినిధులు, ఇంజనీర్లు పాల్గొన్నారు.

● గరివిడి: స్థానిక అవంతీస్ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్ డా.జె.బాలభాస్కరరావు అధ్యక్షతన సోమవారం ఇంజనీర్స్‌డే నిర్వహించారు. ఈసందర్భంగా భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మెకానికల్ ఇంజనీర్, గరివిడి ఫెర్రో ఎల్లాయీస్ కార్పొరేషన్ లిమిటెడ్ ఏజీఎం ఆర్‌వీకే దుర్గాప్రసాద్ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన్ని సన్మానించారు. ఏవో జి.అనీల్‌కుమార్, వివిధ విభాగాధిపతులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



డెంకాడ: ఎంవీజీఆర్ కళాశాలలో మనూ కపూర్‌ని సత్కరిస్తున్న దృశ్యం



గరివిడి: మెకానికల్ ఇంజనీర్ దుర్గాప్రసాద్‌ను సన్మానిస్తున్న దృశ్యం

సహకార సంఘాల బలోపేతమే లక్ష్యం



మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ సూర్యనారాయణ

సంతకవిటి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల బలోపేతమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా డీసీసీబీ చైర్మన్ సువ్వాల సూర్యనారాయణ అన్నారు. సంతకవిటి సహకార సంఘాన్ని ఆయన సోమవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి ఉన్న ప్రతి ఒక్క రైతుకు సహకార సంఘం ద్వారా సేద్యం చేసేందుకు సహకరిస్తుందన్నారు. సహకార సంఘంలోని రైతులకు ఎలాంటి రుణాలను అందించారని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈయనతో పాటు రాష్ట్ర మాజీ తూర్పుకాపు చైర్మన్ కొల్ల అప్పలనాయుడు, రాజాం నియోజకవర్గం వాణిజ్య విభాగం అధ్యక్షుడు వల్లూరు గణేష్, టీడీపీ మండల అధ్యక్షుడు గట్టి భాను తదితరులు పాల్గొన్నారు.

రైతులను తప్పుదోవ పట్టించొద్దు

గజపతినగరం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు రైతులను యూరియాపై తప్పుదోవ పట్టించే విధంగా కుటిల యత్నాలకు పాల్పడుతున్నారని, ఇది ఎంతమాత్రం తగదని ఏఎంసీ చైర్మన్ పీవీవీ గోపాలరాజు అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో యూరియా పుష్కలంగా పంపిణీ జరుగుతున్నప్పటికీ కావాలనే రైతులను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేయడం దారుణమన్నారు. పీఏసీఎస్‌లో ఫర్నీచర్ ధ్వంసం చేయడం తగదన్నారు. పీఏసీఎస్ చైర్మన్ లెంక బంగారునాయుడు, మాజీ ఎంపీపీ గంట్యాడ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

మోక్షకు బాలరత్న అవార్డు



మోక్షను సత్కరిస్తున్న దృశ్యం

రాజాం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): స్థానిక వరలక్ష్మీ డీఏవీ పబ్లిక్ స్కూల్‌లో నాలుగో తరగతి చదువుతున్న వాకాడ మోక్ష అభినయకు దాసరి నారాయణరావు కల్చరల్ అకాడమీ ఆంధ్ర రాష్ట్ర బాలరత్న అవార్డుకు ఎంపిక చేసింది. ఈసందర్భంగా ఆదివారం విశాఖపట్నంలో ఆ చిన్నారిని సత్కరించారు. మోక్ష రాజాం జవహర్ బాల భవన్‌లో నృత్యం నేర్చుకుంటూ ప్రముఖ నృత్య కళాకారుడు సంపత్ కుమార్ చేసినటువంటి ఆంధ్ర జాలరి నృత్యం చేస్తూ జిల్లా స్థాయిలో మంచి పేరు సంపాదించుకుంది. తన ప్రతిభను గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు బాల భవన్ సూపరింటెంట్ డా.సుంకరి రమేష్ తెలిపారు. తనకు నృత్యం నేర్పిన డాన్స్ మాస్టర్ తారక్‌ని అభినందించారు.

స్నేహితుడి జ్ఞాపకార్థంగా మొక్కల పంపిణీ



మొక్కలు పంపిణీ చేస్తున్న దృశ్యం

నెల్లిమర్ల, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఇటీవల మృతిచెందిన తన స్నేహితుడు స్మారకార్థం సారిపల్లి గ్రామంలోని తన స్నేహితులంతా కలిసి ప్రజలకు మొక్కలు పంపిణీ చేశారు. సారిపల్లికి చెందిన గణేష్ అనే పదో తరగతి విద్యార్థి ఇటీవల విద్యుదాఘాతంతో మృతిచెందాడు. దీంతో గణేష్ జ్ఞాపకార్థం తన స్నేహితులంతా కలిసి సోమవారం ఉచితంగా మొక్కలు పంపిణీ చేశారు.

పెట్టుబడులు రానివ్వకుండా అడ్డుకుంటున్నారు

● ఎమ్మెల్యే కళా వెంకటరావు

చీపురుపల్లి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి పెట్టుబడులు రానివ్వకుండా జగన్ అండ్ కో అడ్డుకుంటోందని, పారిశ్రామికవేత్తలను వెనక్కి పంపించడానికి వారు అన్ని విధాలా ప్రయత్నాలు చేస్తున్నారని ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు ఆరోపించారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అభివృద్ధి కోసం ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతున్న పనులన్నీ తాము అధికారంలోకి రాగానే రద్దు చేస్తామని చెప్పడం ప్రజలపై వారికున్న అభిమానాన్ని నిరూపిస్తోందన్నారు. పెట్టుబడులతో రాష్ట్రానికి వస్తున్న కంపెనీలను వారు భయ పెడుతున్నారన్నారు. అధికారంలో ఉన్న ఐదేళ్లలో విశాఖ స్టీల్ ప్లాంటు కోసం నోరు మెదపని ఆ పార్టీ నాయకుడు బొత్స సత్యనారాయణ ఇప్పుడు మాట్లాడడమేమిటని కళా ప్రశ్నించారు. అనంతరం వచ్చే నెల 15 వరకూ గ్రామాల్లో నిర్వహించనున్న పశు వైద్య శిబిరాలకు సంబంధించి పోస్టర్‌ను ఎమ్మెల్యే విడుదల చేశారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు రౌతు కామునాయుడు, ఆలయ కమిటీ చైర్మన్ గవిడి నాగరాజు, పైల బలరాం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళా వెంకటరావు

500 మార్కులే లక్ష్యం

● డిప్యూటీ డీఈవో వెంకటరమణ

లక్కవరపుకోట, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అన్ని హైస్కూళ్లలో చదువుతున్న పదో తగరతి విద్యార్థులు రానున్న పబ్లిక్ పరీక్షల్లో 500 మార్కుల లక్ష్యంతో చదవాలని అందుకు తగిన ప్రణాళిక సిద్ధం చేశామని జిల్లా ఉప విద్యా శాఖాధికారి వెంకటరమణ తెలిపారు. కల్లేపల్లి-రేగ హైస్కూల్‌ను ఆయన సోమవారం తనిఖీ చేశారు. పాఠశాల నిర్వహణ, రికార్డుల నిర్వహణ, విద్యార్థుల సామర్థ్యం బాగా ఉన్నట్టు తెలిపారు. రానున్న పదో తరగతి పరీక్షల్లో ప్రతిఒక్క విద్యార్థి 500 మార్కులు దాటేలా చదవాలన్నారు. అందుకు తగిన ప్రణాళిక ఉపాధ్యాయుల వద్ద ఉందన్నారు. రాష్ట్రంలో జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు సీహెచ్.కూర్మారావు, శ్రీనివాసరావు, హెచ్‌ఎం సాంబశివరావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



రికార్డులను తనిఖీ చేస్తున్న డిప్యూటీ డీఈవో

సమాచారం ఇవ్వకుండా ఎలా పంపిణీ చేస్తారు?

గజపతినగరం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): గ్రామానికి యూరియా వచ్చినప్పుడు తమకు సమాచారం ఇవ్వకుండా ప్రైవేటు స్థలంలో ఎలా పంపిణీ చేస్తారని పలు గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు ఏవో కిరణ్ కుమార్‌ను నిలదీశారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కొత్తశ్రీరంగరాజపురం గ్రామానికి చెందిన సర్పంచ్ పైడిపినాయుడు తమ గ్రామానికి చెందిన ఒకరికే 50 బస్తాల యూరియా ఏ విధంగా ఇచ్చారని ప్రశ్నించారు. ఇందుకు ఏవో తనకు ఈ విషయం తెలియదని ఇక ముందు ఇలా జరగకుండా చూస్తానని తెలిపారు. మదుపాడ సర్పంచ్ పైడిపి నాయుడు తమ గ్రామంలో భూములు అక్రమంగా ఆన్‌లైన్‌లు జరిగిపోతున్నాయని తహసీల్దార్ దీనిపై దృష్టి సారించాలన్నారు. ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్ బాబు మాట్లాడుతూ అధికారుల తీరుతో రైతులకు ఇబ్బందులు కలిగించరాదన్నారు. స్మార్ట్ మీటర్లు గృహ యజమానుల అంగీకారం తప్పని సరిగా ఉండాల న్నారు. ఏఎంసీ చైర్మన్ పీవీవీ గోపాలరాజు మాట్లాడు తూ అధికారులు గ్రామంలో ఉండే రెండు పార్టీలను సమన్వయం చేసుకుంటూ రైతులకు మేలు జరిగేలా వెళ్లాలని సూచించారు.

సమస్యల పరిష్కారానికి కృషి

భోగాపురం, సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శుల సమస్యల పరిష్కారానికి ఏపీ ఎన్జీవో సంఘం కృషి చేస్తోందని ఆ సంఘ జిల్లా కార్యదర్శి ఎ.సురేష్ అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో పంచాయతీ ఉద్యోగులు ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉదయం 6గంటలకే కార్యదర్శులను విధుల్లో చేరమనడం భావ్యం కాదన్నారు. సమస్యను ఈనెల 18న సంఘ రాష్ట్ర అధ్యక్షుల ఆధ్వర్యంలో రాష్ట్ర పంచాయతీ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లడానికి సన్నాహాలు చేస్తున్నామన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీధర్, భోగాపురం అధ్యక్షుడు కొమ్మూరు దుర్గారావు, కార్యదర్శి అప్పలనాయుడు, కార్యదర్శుల ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీ ఎన్జీవో సంఘం జిల్లా కార్యదర్శి సురేష్

విద్యుత్ ఉద్యోగుల నిరసన

విజయనగరం రింగురోడ్డు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యుత్ కార్మికుల ఉమ్మడి కార్యచరణ కమిటీ పిలుపు మేరకు సోమవారం స్థానిక విద్యుత్ భవనం వద్ద ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. దీర్ఘకాలిక సమస్య సాధన కోసం సోమ, మంగళవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ సురగాల లక్ష్మణ్, ఉద్యోగులు పాల్గొన్నారు.

● జామి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కోరుతూ జామి మండలంలోని విద్యుత్ ఉద్యోగులు సోమవారం నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) పిలుపుమేరకు రాష్ట్ర వ్యాప్తంగా దశలవారీగా సంబంధిత కార్యాలయాలు ఎదుట నిరసన కార్యక్రమం చేసినట్టు యూనియన్ నాయకులు తెలిపారు.



విజయనగరంలో నల్లబ్యాడ్జీలతో నిరసన చేస్తున్న ఉద్యోగులు

రేపటి నుంచి మహిళలకు ఆరోగ్య పరీక్షలు

బొండపల్లి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): స్థానిక పీహెచ్‌సీ పరిధిలోని అన్ని సచివాలయాల్లో ఈనెల 17 నుంచి స్వస్త్ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం ప్రారంభం కానున్నట్టు వైద్యాధికారి సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళలకు రక్తపోటు, మధుమేహం, నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ కాన్సర్, క్షయవ్యాధి నిర్ధారణ తదితర వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

● కొత్తవలస: మహిళలకు క్యాన్సర్ వ్యాధికి సంబంధించి ఈనెల 17వ తేది నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు గ్రామాల వారీగా స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహిస్తున్నట్టు వియ్యంపేట పీహెచ్‌సీ వైద్యాధికారి గోపాలకృష్ణ తెలిపారు. ఇందులో భాగంగా సోమవారం స్థానిక పీహెచ్‌సీకి చెందిన వైద్య సిబ్బందికి ఒక్కరోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ స్క్రీనింగ్ పరీక్షలు 11 సంవత్సరాలు దాటిన బాలికల నుంచి మహిళలు అందరికీ చేస్తారని చెప్పారు. స్వస్థ నారీ పరివార్ కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

● లక్కవరపుకోట: మండలంలోని అన్ని గ్రామాల్లో బుధవారం నుంచి అక్టోబరు 2 వరకు మహిళల ఆరోగ్యంపై విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నట్టు మండల వైద్యాధికారి బి.అనీల్‌కుమార్ తెలిపారు. సోమవారం ఆయన స్థానిక పీహెచ్‌సీలో ఆశావర్కర్లు, పీహెచ్‌సీల సిబ్బందితో సమావేశం నిర్వహించారు. రెండు వారాలపాటు చేపడుతున్న స్వస్థ్ నారీ సశక్త్ అభియాన్ కార్యక్రమా న్ని విజయవంతంగా ప్రచారం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీల సిబ్బంది పాల్గొన్నారు. ● శృంగవరపుకోట రూరల్: కొత్తూరు గ్రామంలో సర్పంచ్ సీహెచ్ లక్ష్మీ ఆధ్వర్యంలో సోమవారం స్వస్థ నారీ పరివార్ అభియాన్ కార్యక్రమంపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఏఎన్‌ఎం స్వప్నకుమారి, ఆశావర్కర్ కోటా లక్ష్మీ, అంగన్‌వాడీ కార్యకర్త రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం

● ఉపాధ్యాయుల ధర్నా

రాజాం రూరల్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): తమకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలని, బోధనేతర పనులు అప్పగించవద్దని ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ధర్నాకు దిగారు. ఈసందర్భంగా ఆ సంఘ శ్రీకాకుళం అధ్యక్షుడు మజ్జి మదన్‌మోహన్ మాట్లాడుతూ సకాలంలో ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమాన్ని తీవ్ర తరం చేస్తామని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం నాలుగు డీఏలు బకాయి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ విజయనగరం జిల్లా ఉపాధ్యక్షులు లెంక రామకృష్ణ, మురపాక వెంకట రమణ, జిల్లా కార్యదర్శి వై.సీతంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు

యూరియా కోసం ఆందోళన వద్దు



యూరియా పంపిణీపై అధికారులను ఆరా తీస్తున్న ఆర్డీవో కీర్తి

డెంకాడ, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): రైతులు ఎవరూ యూరియా కోసం ఆందోళన చెందవద్దని ఆర్డీవో డి.కీర్తి తెలిపారు. సోమవారం ఆమె చొల్లంగిపేట రైతు సేవా కేంద్రాన్ని సందర్శించారు. ఈసందర్భంగా యూరియా పంపిణీపై రైతులు ఆందోళన చేశారు. దీంతో ఆమె తోపాటు విజయనగరం సబ్ డివిజన్ ఏడీఏ నాగభూషణరావు, తహసీల్దార్ రాజారావు, పోలీసులు, వ్యవసాయాధికారి పి.సంగీత స్పందించారు. రైతులకు కావాల్సిన యూరియాను పంపిణీ చేస్తామ న్నారు. చల్లంగిపేట రైతు సేవా కేంద్రానికి 173 బస్తాల యూరియా రాగా, ఉదయం పంపిణీ ప్రారంభించారు. అయితే అందరికీ సరిపోయినంత యూరియా వచ్చినా తర్వాతే పంపిణీ ప్రారంభించాలని రైతులు అధికారులను కోరారు. దీంతో అధికారులు యూరియా పంపిణీ నిలిపివేసి, జిల్లా కంట్రోల్ రూంకు తెలియజేశారు. వెంటనే ఇంకొక 266 బస్తాలు విజయనగరం నుంచి తీసుకువచ్చి, చొల్లంగిపేటలోని 6 రెవెన్యూ గ్రామాల రైతులకు పంపిణీ చేశారు. యూరియా పంపిణీ సజావుగా చేసినట్టు ఏడీఏ తెలిపారు.

● కొత్తవలస, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): యూరియా కోసం మండలంలో రైతుల ఆందోళన పడాల్సిన అవసరం లేదని కొత్తవలస వ్యవసాయ శాఖ ఏడీ భానులత, తహసీల్దార్ అప్పలరాజు తెలిపారు. గనిశెట్టిపాలెంలోని రైతు సేవా కేంద్రంలో సోమవారం యూరియా పంపిణీ చేశారు. ఈసందర్భంగా వీరు మాట్లాడుతూ మండలానికి రెండో దఫా కూడా యూరియా వస్తుందని చెప్పారు. ఏవో కేవీ రాంప్రసాద్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కనీస వేతనం ఇవ్వాలి



ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

రాజాం రూరల్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, వారికి రూ.26వేలు కనీస వేతనంగా ఇవ్వాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాజాం ప్రాజెక్ట్ గౌరవ అధ్యక్షుడు రామ్మూర్తినాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం రాజాంలో ధర్నా నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు తల్లికి వందనం పథకం అమలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. కార్యకర్తలు, ఆయాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

జీఎంఆర్ ఐటీలో జాతీయ సదస్సు

రాజాం రూరల్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): స్థానిక జీఎంఆర్ఐటీ ప్రాంగణంలో సోమవారం అటల్ స్పాన్సర్డ్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (జాతీయ సదస్సు) ప్రారంభమయ్యింది. మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో మ్యానుఫ్యాక్చరింగ్ అండ్ ఇండస్ట్రీస్ 4.0 కార్యక్రమం ఈనెల 19 వరకూ ఆన్‌లైన్ మోడ్‌లో కొనసాగనుంది. కార్యక్రమంలో పాల్గొన్న అమేస్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ మాన్యుఫ్యాక్చరింగ్ అండ్ ఇండస్ట్రీ మేనేజర్ శ్రేయాన్స్ ఖోట్ మాట్లాడుతూ.. ఎడిటివ్ మ్యాన్యుఫ్యాక్చరింగ్ ప్రాధాన్యతను వివరించారు. భవిష్యత్తు పరిశ్రమలలో డిజిటలైజేషన్, ఆటోమేషిన్‌తో కలిసి ఎడిటివ్ మాన్యుఫ్యాక్చరింగ్ మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా ప్రసిద్ధ సంస్థల నుంచి 120 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. డా.జె.గిరీష్, డా.ప్రసాద్, డా.జి.శశికుమార్, డా.ఎ.ఎల్.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా బంద్‌ను జయప్రదం చేయండి

దత్తిరాజేరు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): సీఐటీయూ, ఏఐఎఫ్‌టీయూ న్యూ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఈనెల 17న చేపట్టనున్న ఆటో, క్యాబ్‌ల బంద్‌ను విజయవంతం చేయాలని సీఐటీయూ, ఆటో యూనియన్ నాయకులు కోరారు. ఈ సందర్భంగా సోమవారం కోమటిపల్లి ఆటో స్టాండ్ వద్ద బంద్‌కు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 17వ తేదీ ఉదయం 6 గంటల నుంచి 10 గంటలకు విజయనగరం కోట దగ్గర నుంచి మయూరి జంక్షన్ వరకు నిర్వహించనున్న ర్యాలీలో జిల్లాలో ఉన్న కార్మికులంతా పాల్గొనాలని కోరారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు వి.లక్ష్మి, ఆటో యూనియన్ అధ్యక్షుడు బి.అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పార్టీ నుంచి బయటకు వచ్చేందుకు నిర్ణయం

శృంగవరపుకోట, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు భార్య ఇందుకూరి సుధారాణి వర్గం టీడీపీ నుంచి బయటకు వచ్చేందుకు నిర్ణయం తీసుకున్నారు. సోమవారం ఎస్.కోట ఎంపీపీ కార్యాలయంలో ఎంపీపీ సోమేశ్వరరావుతో పాటు టీడీపీకి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో ఆమె సమావేశమయ్యారు. భవిష్యత్తు కార్యాచరణపై చర్చించారు. గ్రామాల్లో తమకు పార్టీ పరంగా ఎటువంటి న్యాయం జరగనందున మూకుమ్మడిగా రాజీనామాలు చేసేద్దామని అంతా ఒకే మాటగా చెప్పారు. కార్పొరేషన్, పార్టీ పదవులు అప్పగించకపోవడంతో పాటు కనీసం సమాచారం కూడా ఇవ్వడం లేదని వాపోయారు. సమస్యను పార్టీ పెద్దల ముందు పెట్టిన తర్వాత అందరం కలిసి రాజీనామాలు చేసేద్దామని సుధారాణి వారికి నచ్చచెప్పారు. ఏ పార్టీ అండ లేకుండానే వచ్చే స్థానిక ఎన్నికల్లో స్వతంత్రంగా సత్తా చాటుదామని ఆమె పిలుపునిచ్చారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక

దత్తిరాజేరు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు రామచంద్రపురం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల ఆరికతోట జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి జూడో అండర్-14 విభాగంలో బోనెల అఖిల్‌కుమార్, అండర్-17 విభాగంలో కొండేటి జ్యోత్స్న ఎంపికైనట్టు హెచ్‌ఎం చుక్క మూర్తినాయుడు సోమవారం తెలిపారు. ఎంపికైన విద్యార్థులను హెచ్‌ఎంతోపాటు పీడీ మామిడి చంద్రరావు, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు. ● భోగాపురం: జాతీయ స్థాయి మోడరన్ పెంటాథిలిన్ లేజర్ రన్ క్రీడా పోటీల్లో రావాడ హైస్కూల్‌కు చెందిన అవనాపు భీష్మ అనే విద్యార్థి కాంస్య పతకం సాధించినట్టు హెచ్‌ఎం సూర్యనారాయణ తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థితో పాటు పీడీ ఎన్.సూర్యనారాయణను ఉపాధ్యాయులు అభినందించారు.

స్టేషన్ రోడ్డులో పోలీసుల శ్రమదానం

చీపురుపల్లి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పోలీస్, రైల్వే స్టేషన్లకు వెళ్లే రహదారిని పోలీసులే బాగు చేసుకున్నారు. గత కొంత కాలంగా ఈ రోడ్డు గోతుల మయంగా మారి, ప్రయాణికులకు ఇబ్బంది కలిగిస్తోంది. భారీ వాహనాలు తిరుగుతుండడంతో ఈ రోడ్డు పూర్తిగా పాడైపోయింది. దీంతో పోలీస్ స్టేషన్, రైల్వే స్టేషన్లకు వెళ్లే వారు గత కొంత కాలంగా ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఎస్ఐ దామోధరరావు నేతృత్వంలో స్టేషన్ సిబ్బంది సోమవారం శ్రమదానానికి నడుం బిగించారు. గ్రావెల్ వేసి, రహదారినిపై ఉన్న గోతులు పూడ్చారు. ఎక్సకవేటర్ సాయంతో రోడ్డుకు ఇరువైపులా ఉన్న తుప్పలు తొలగించి, రహదారిని శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

అసైన్డ్ కమిటీని ఏర్పాటు చేయాలి

మెంటాడ, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం తక్షణమే అసైన్డ్ కమిటీని ఏర్పాటు చేసి, పేదల సాగు భూములకు పట్టాలు మంజూరు చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం, ఏపీ ఆదివాసీ గిరిజన సంఘాల జిల్లా కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు, తహసీల్దార్ అరుణకుమారికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు రాకోటి రాములు, టి.సోములు, ఎంఏ నరసింగరావు పాల్గొన్నారు.

మహిళా పోలీసులకు అవగాహన సదస్సు

గుర్ల, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న మహిళా పోలీసులకు గుర్ల ఐసీడీఎస్ కార్యాలయంలో పీవో ఆరుద్ర ఆధ్వర్యంలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పీవో మాట్లాడుతూ చైల్డ్ వెల్ఫేర్ ప్రొటెక్షన్ కమిటీ, చైల్డ్ మ్యారేజ్ ప్రొటెక్షన్ కమిటీలను ఏర్పాటుచేసి, గ్రామస్థాయిలో కౌన్సిలింగ్ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బి.శకుంతల, గుర్ల, గరివిడి మండలాల మహిళా పోలీసులు పాల్గొన్నారు.

విస్తరణ.. ఇలానా?

(ఐదో పేజీ తరువాయి)

నాణ్యతలో డొల్లతనం స్పష్టమవుతోంది. రాజాంలో రెండోవిడత విస్తరణకు సంబంధించి బొబ్బిలి జంక్షన్ నుంచి గాయత్రీ కాలనీ వరకూ 1.34 కిలోమీటర్లు, అంబేడ్కర్ జంక్షన్ నుంచి జీఎంఆర్ ఐటీ వరకు రెండు కిలోమీటర్ల విస్తీర్ణంలో 80 అడుగులమేర విస్తరించాల్సి ఉంది. 3.34 కిలోమీటర్ల పనులకు రూ.20 కోట్లు నిధులు మంజూరయ్యాయి. బొబ్బిలి జంక్షన్ నుంచి గాయత్రీ కాలనీ వరకూ జరిగిన కాల్వల నిర్మాణ పనులతో పాటు డివైడర్ల నిర్మాణాలపై అప్పట్లో విమర్శలు వెల్లువెత్తాయి. కొంతమందికి అనుకూలంగా కాల్వల నిర్మాణంలో చేతివాటం ప్రదర్శించారన్న అపవాదును ఆర్అండ్‌బీ, మునిసిపాలిటీ అధికారులు ఎదుర్కోవాల్సి వచ్చింది. అయినాసరే.. అంబేడ్కర్ జంక్షన్ నుంచి జీఎంఆర్ ఐటీ వరకూ ప్రస్తుతం జరుగుతున్న కాల్వల నిర్మాణంలో సైతం కొంతమందికి అనుకూలంగా అధికారులు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. వారి ఆరోపణలకు బలం చేకూర్చేలా నిర్మాణాలు సైతం కనిపిస్తున్నాయి.

పైన భవనాల డూమ్‌లు.. కింద కాలువ

కాల్వల నిర్మాణం విషయంలో అధికారులు చేతివాటం ప్రదర్శించారన్న అపవాదు వినిపిస్తోంది. వాస్తవానికి కాల్వ నిర్మాణ జరిపే సమయంలో భవనం గోడలు కొట్టాల్సి ఉంటుంది. అయితే రాజాం-డోలపేట రోడ్‌లో మోర్ ఎదుట షాపుల గోడలు, డూమ్‌లు కొట్టకుండా కాల్వ నిర్మాణం జరిపిస్తున్నారు. పైన డూమ్‌లు ఉంటుండగానే కింద కాల్వ నిర్మాణం చేపట్టడంపై పట్టణవాసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గతంలో మెయిన్‌రోడ్ విస్తరణ సమయంలో నిర్దేశించిన 80 అడుగుల మేర భవనాలను కొట్టి కాల్వ నిర్మించారు. ప్రస్తుతం అందుకు విరుద్ధంగా కాల్వ నిర్మాణం చేపట్టడం వెనుక కాసులు చేతులు మారాయన్న ఆరోపణలున్నాయి. ఇలా నిర్మాణం జరిపితే ఫుట్‌పాత్ ఉండేదెక్కడో అధికారులకే తెలియాలి.

డివైడర్లు సైతం...

80 అడుగుల మేర రహదారి విస్తరణ సమయంలో రహదారిని కొంతమేర తవ్వి కాంక్రీట్ వేసి డివైడర్‌ను నిర్మించాల్సి ఉంది. అయితే అంబేడ్కర్ జంక్షన్ నుంచి డోలపేటకు వెళ్లే మార్గంలో మోర్ ఎదుట రోడ్డును తవ్వకుండా, కాంక్రీట్ వేయకుండా రోడ్డుపైనే డివైడర్ నిర్మాణం పనులు జరిపిస్తున్నారు. ఇదిలా ఉంటే ఓవైపు డివైడర్ పనులు జరుగుతుంటే మరోవైపు ఎక్కడికక్కడ బీటలు వారి డివైడర్లు విరిగిపోతున్నాయి.

80 అడుగుల మేరకే

నిబంధనల మేరకు 80 అడుగులకు తగ్గకుండా రహదారి విస్తరణ పనులు జరిపిస్తున్నాం. కాల్వల నిర్మాణం కూడా ఆ పరిధిలోనే ఉంది. ఫుట్‌పాత్‌లపై గోడలు, శ్లాబ్‌లు, డూమ్‌లు తొలగించి, అభివృద్ధి చేయాల్సిన బాధ్యత మునిసిపాలిటీదే. ఇందులో మా ప్రమేయం లేదు. కాలువలతో కలిపి 80 అడుగుల మేర విస్తరిస్తున్నాం..

-నాగభూషణరావు, ఏఈ, ఆర్అండ్‌బీ, రాజాం

మార్కింగ్ ఇచ్చాం

ఫుట్‌పాత్‌లపై నిర్మాణాలు ఉండకూడదు. పాదచారులు రాకపోకలకు వీలుగా ఫుట్‌పాత్‌లు ఉండాలి. విస్తరణ పనులు జరుగుతున్న ప్రాంతంలో భవనాల యజమానులకు ఇప్పటికే అందరికీ మార్కింగ్ ఇచ్చాం. ఆ మేరకు శ్లాబ్‌లు, డూమ్‌లు, తాత్కాలిక నిర్మాణాలు తొలగించాలి. లేకపోతే నోటీసులిచ్చి తామే తొలగిస్తాం.

-రామ అప్పలనాయుడు, కమిషనర్, రాజాం మున్సిపాలిటీ

మాస్టార్లు వచ్చేస్తున్నారు

(ఐదో పేజీ తరువాయి)

చేయలేదు. ఇక మునిసిపల్ పరిధిలో స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీష్ 4, తెలుగు 2, సోషల్ 2, ఎస్జీటీలు 47 పోస్టులు చొప్పున భర్తీ చేశారు. మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో జీవశాస్త్రం, ఫిజికల్ ఎడ్యుకేషన్ ఒక్కొక్కటి, సోషల్ రెండు, ఎస్జీటీ 10 భర్తీ చేశారు. ఎస్జీటీ ఉర్దూ మీడియం పోస్టుల విషయానికి వచ్చేసరికి నాలుగు పోస్టులకు అభ్యర్థులు లేక వాటిని భర్తీ చేయలేదు. గిరిజన సంక్షేమ శాఖకు సంబంధించి స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీష్ 7, జీవ శాస్త్రం 16, గణితం 25, ఫిజిక్స్ 24, సోషల్ 5, ఎస్జీటీలు 60 పోస్టులు భర్తీ చేశారు. ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులు తమకు ముందే దసరా పండగ వచ్చిందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

22 నుంచి ఉపాధ్యాయులకు శిక్షణ

జిల్లాలో ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు దసరా సెలవుల సమయంలో ఈనెల 22 నుంచి 29 వరకూ 8 రోజులు పాటు శిక్షణ ఉంటుంది. తద్వారా వారి బోధనా నైపుణ్యాలను అభివృద్ధి చేసి సమాజ అభివృద్ధి కోసం నిజాయితీ, నిబద్ధత, అంకితభావంతో పనిచేసేలా దిశానిర్దేశం చేస్తారు. ట్రైనింగ్ సమయంలోనే కౌన్సెలింగ్ ద్వారా ప్లేస్‌మెంట్ ఆర్డర్లు జారీ చేస్తారు. శిక్షణ పూర్తయిన వెంటనే నూతన ఉపాధ్యాయులు తమకు కేటాయించిన పాఠశాలల్లో చేరతారు.

నానోతో ఊరట

(ఐదో పేజీ తరువాయి)

అయితే రూ.350 పైమాటే. డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని రూ.500కుపైగా అమ్ముతున్నారు. మరోవైపు రైతుభరోసా కేంద్రాల నుంచి ఇంటికి తెచ్చేందుకు రూ.50 నుంచి రూ.100 ఖర్చవుతోంది. అదే నానో యూరియా అయితే 500 మిల్లీలీటర్ల సీసా రూ.225కే లభిస్తోంది. అదే సాధారణ డీఏపీ బస్తా రూ.1350. నానో డీఏపీ సీసా రూ.600కే లభిస్తుంది. బస్తాను మోయాల్సిన పని ఉండదు. సీసాలతో ఎరువును తరలించేయవచ్చు. డబ్బాను ఎక్కడికైనా తీసుకుపోవవచ్చు. ఎరువు నేలపై చల్లితే మొక్కకు పూర్తిస్థాయి అందుతుందో? లేదో? తెలియదు. అదే 500 మిల్లీలీటర్ల ద్రావణం ఎకరాకు సరిపోతుంది. రెండుసార్లు పిచికారీ చేస్తే చాలని అధికారులు సూచిస్తున్నారు.

జిల్లాలో చాలా ప్రాంతాల్లో రైతులు ప్రయోగాత్మకంగా నానో యూరియాను వినియోగించారు. సాధారణ యూరియా కంటే బాగుంటుందని..ముఖ్యంగా తెగుళ్లు లేకుండా పోయాయంటున్నారు. పైగా చేతితో పాటు డ్రోన్ ద్వారా పిచికారీ చేయడం సులువు అంటున్నారు. ముఖ్యంగా అగ్గి తెగులు, పొడ తెగులు రావడం లేదని రైతులు చెబుతున్నారు. సాధారణ యూరియా వేసిన తరువాత పంట నేలవారుతోందని.. నానో వేయడం వల్ల నిటారుగా నిలబడుతుందని ఈ ఎరువును ప్రయోగించిన రైతులు చెబుతుండడం విశేషం. వరి నాటిన 30 రోజుల తరువాత నానో యూరియా వాడితే ఫలితముంటుందంటున్నారు. అయితే నానో యూరియా ప్రభావం ఆలస్యంగా చూపుతుందని చెబుతున్నారు. దీనిపై అవగాహన పెరగాల్సిన అవసరం ఉంది.

ఎన్నో ప్రయోజనాలు

నానో ఎరువులతో ఎన్నోరకాల ప్రయోజనాలున్నాయి. ద్రవ పదార్థాల్లో ఉండే ఎరువు వినియోగం చాలా సులువు. ధర కూడా తక్కువ. నిపుణులు కూడా నానో ఎరువు శ్రేయస్కరమని చెబుతున్నారు. ద్రవ పదార్థంతో కూడిన ఎరువు నిత్యం అందుబాటులో ఉంటుంది కూడా. రాయితీపైనా ప్రభుత్వాలు అందిస్తున్నాయి. వాటిని సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఉంది.

- సీహెచ్ రఘునాథ్, మండల వ్యవసాయ అధికారి, రాజాం

సచివాలయ ఉద్యోగులపై పర్యవేక్షణ ఏదీ?

- ఇష్టారాజ్యంగా విధుల నిర్వహణ
- ఎక్కడో చోట ఎఫ్ఆర్ఎస్ నమోదై.. సొంత పనులకు..
- జగన్నాథపురంలో ఇదీ దుస్థితి

బొబ్బిలి రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రామ సచివాలయాల్లోని ఉద్యోగులపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడింది. దీంతో వారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. వివిధ పనులపై సచివాలయాలకు వచ్చేవారు సంబంధిత ఉద్యోగుల కోసం వేచి ఉండే పరిస్థితి నెలకొంటోంది. మండలంలో 22 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. వాటిలో దాదాపు 200 మంది ఉద్యోగులు ఉన్నారు. సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు పంచాయతీ సెక్రటరీకి అడ్మిన్ బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది. ఉద్యోగులపై పర్యవేక్షణ బాధ్యత ఆయనదే. అయితే మండలంలోని కొన్ని గ్రామ సచివాలయాల్లో కొందరు ఉద్యోగులు ఇష్టానురీతిన సచివాలయాలకు వస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వారు ఎక్కడ, ఎప్పుడు విధులు నిర్వహిస్తున్నారన్నది కూడా అడ్మిన్‌కే తెలియని దుస్థితి నెలకొంది. సచివాలయాలకు కొందరు ఉద్యోగులు రాకపోవడమే కాదు.. రోజుల తరబడి రిజిస్టర్‌లో సంతకాలు కూడా చేయడం లేదు. బొబ్బిలి పట్టణానికి కూతవేటు దూరంలోని జగన్నాథపురం సచివాలయంలో సోమవారం అక్కడి సిబ్బంది ఎవ్వరూ రిజిస్టర్‌లో సంతకాలు చేయలేదు. ఎవరు ఎక్కడ పని చేస్తున్నారన్న మూమెంట్ కూడా లేదు. ఎక్కడో చోట ఎఫ్ఆర్ఎస్ వేసుకుని సొంత పనుల్లో వారు బిజీగా ఉంటున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. వారిని కట్టడి చేయాల్సిన అడ్మిన్ చేతులెత్తేసినట్టు తెలుస్తోంది.



ఉద్యోగుల సంతకాలు లేని రిజిస్టర్

● ఈ విషయంపై డిప్యూటీ ఎంపీడీవో అల్లు భాస్కరరావు వివరణ కోరగా.. మూమెంట్ రిజిస్టర్‌లో సచివాలయ సిబ్బంది తప్పకుండా సంతకాలు చేయాల్సి ఉంటుందన్నారు. అలా ఎందుకు జరిగిందో విచారించి చర్యలు చేపడతామన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన


పనులకు శంకుస్థాపన చేస్తున్న చైర్మన్

బొబ్బిలి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపాలిటీ పరిధిలో 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్‌బాబు సోమవారం భూమి పూజ చేశారు. గొల్లపల్లి 12వ వార్డు దమ్మావీధిలో రూ.10.50 లక్షలతో సీసీ రోడ్డు, 11వ వార్డులో రూ.3 లక్షలతో సీసీ రోడ్డు, 9వ వార్డు దేవాంగుల వీధిలో రూ.4.7 లక్షలతో సీసీ రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ పనులన్నింటినీ నాణ్యతతో సకాలంలో పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. కార్యక్రమంలో డీఈఈ పెదిరెడ్ల కిరణ్‌కుమార్, మున్సిపల్ మాజీ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, సావు శారద, బొత్స రమణమ్మ, పిరిడి ఈశ్వరరావు, బొబ్బాది తవిటినాయుడు, తెర్లి సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

పాండురంగ విఠలుడిగా వేంకటేశ్వరుడు


విఠలుడి అలంకరణలో స్వామివారు

బొబ్బిలి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి):పట్టణంలోని సింగారపు వీధిలోగల వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం సాయంత్రం స్వామివారిని పండరీపురం పాండురంగ విఠలుడిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీవైష్ణవ సంప్రదాయం ప్రకారం శ్రీకృష్ణ జన్మ తిరునక్షత్రం సందర్భంగా స్వామివారిని శ్రీకృష్ణ పెరుమాళ్‌గా అభిషేకించి ప్రత్యేక అలంకరణ చేశారు. రాత్రి కణ్ణన్ పెరుమాళ్‌కి ఊంజల్ సేవ మహోత్సవం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త గెంబలి శ్రీనివాసరావు, అర్చకులు గిరీష్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భక్తసంఘం ప్రతినిధి చెలికాని వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు. మంగళవారం కూడా స్వామి వారిని విఠలుడి అలంకరణలో భక్తులు దర్శించుకోవచ్చని గిరీష్‌కుమార్ తెలిపారు.

ఘనంగా హిందీ దివస్

రామభద్రపురం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం హిందీ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం వంగపండు గోపాలనాయుడు మాట్లాడుతూ జాతీయ భాష హిందీని ప్రతీ ఒక్కరూ నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో హిందీ ఉపాధ్యాయులు వి. విజయలక్ష్మి, నళినీకుమారి, పీడీ శ్రీదేవి, పీఈటీ బెవర రామారావు, డ్రాయింగ్ ఉపాధ్యాయుడు కాళ్ల సురేష్, కల్యాణి పాల్గొన్నారు.

తునిలో రేజేరు యువకుడి మృతి


చరణ్ (ఫైల్)

బాడంగి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రేజేరు గ్రామానికి చెందిన పోతావత్తుల చరణ్ (20) ఆదివారం తునిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో సోమవారం మృతి చెందాడు. తునిలో రొయ్యల కంపెనీలో పనిచేస్తున్న చరణ్ బైకుపై వెళుతూ ప్రమాదానికి గురై మృతిచెందాడు. మృతదేహానికి అక్కడ పోస్టుమార్టం నిర్వహించిన స్వగ్రామం రేజేరుకు తరలించారు. ఇక్కడ అంత్యక్రియలు నిర్వహించారు. చరణ్ తండ్రి రామకృష్ణతో పాటు బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. చరణ్ అన్నయ్య హైదరాబాద్‌లో పనిచేస్తున్నాడు. ఉపాధి కోసం వెళ్లి ఊపిరి తీసుకున్నాడని గ్రామస్థులు విచారం వ్యక్తం చేశారు.

స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకించాలి

పాలకొండ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : విశాఖలోని స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను అధికార, ప్రతిపక్ష, విపక్ష పార్టీలు వ్యతిరేకించా లని సినీనటుడు, నిర్మాత ఆర్.నారాయణమూర్తి అన్నారు. సోమవారం తాను నిర్మించిన నటించిన యూనివర్సిటీ పేపర్ లీకేజ్ సినిమా రిలీజ్ సందర్భంగా పాలకొండలోని ఓ థియేటర్‌లో సినిమాను చూసిన అనంతరం ఆయన మాట్లాడారు. స్టీల్ ప్లాంట్ ఉత్తరాంధ్రకు ఆయువు పట్టు అన్నారు. దీని ప్రైవేటీకరణను అన్ని వర్గాలు వ్యతిరేకించాలన్నారు. స్టీల్‌ప్లాంట్‌లో 36 రకాల విభాగాల్లో ఒక్కో విభాగాన్ని ప్రైవేటీకరణ చేసేందుకు కేంద్రం పావులు కదుపుతోందని ఆరోపించారు. 38 మంది బలిదానంతో ఆవిర్భావిం చిన స్టీల్ ప్లాంట్ ప్రైవేటుపరమైతే ఉద్యోగావకాశాలు కోల్పోతార న్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ జరిగితే మహా సంగ్రా మం తప్పదన్నారు. ఆయనతో పాటు ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, నాయకులు పల్లా కొండలరావు, సంతోష్‌కుమార్, సత్తిబాబు ఉన్నారు.

యూరియా కొరతపై సభ్యుల ఆందోళన


మాట్లాడుతున్న మిర్తివలస సర్పంచ్

రామభద్రపురం, సెప్టెంబరు15 (ఆంధ్రజ్యోతి): మండలంలో యూరియా కొరతతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో మిర్తివలస సర్పంచ్ మజ్జి రాంబాబు మాట్లాడుతూ రైతులు యూరియా కొరతతో ఆవేదన చెందుతున్నారన్నారు. 4 ఎకరాల విస్తీర్ణం కలిగిన రైతులకు కూడా ఒక్క బస్తా దొరకకపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. వ్యవసాయాధికారులు ముందస్తు ప్రణాళికలు రూపొందించకపోవడమే ఇందుకు కారణమన్నారు. దీనిపై వ్యవసాయాధికారి అమరా శివ మాట్లాడుతూ రైతులు ముందస్తుగా యూరియా నిల్వలు చేయడంతో ఈ సమస్య ఏర్పడిందన్నారు. నానో యూరియాపై రైతులు దృష్టిసారించాలన్నారు. తహసీల్దార్ అజురఫీజాన్ మాట్లాడుతూ సొంత ఇళ్లులేనివారికి ప్రభుత్వం 3 సెంట్ల స్థలం ఇస్తుందని, అలాగే పక్కా ఇళ్ల మంజూరు చేస్తుందన్నారు. ఇందుకు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. మామిడివలసలో తాగునీటి పైపులైన్లు పాడయ్యాయని, గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారని సర్పంచ్ మూడడ్ల అప్పలనాయుడు తెలిపారు. రావివలసలో కూడా తాగునీటి సమస్య ఉందని సర్పంచ్ కె.కుమారి సమావేశం దృష్టికి తీసుకువచ్చారు మండల పంచాయతీ అధికారి మరడ వెంకటరమణ మాట్లాడుతూ పంచాయతీల్లో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం పెద్ద ఎత్తున చేపట్టాలని సూచించారు. గ్రీన్ అంబాసిడర్ల జీతాల విషయంలో సర్పంచ్‌లు సానుకూలంగా స్పందించాలని ఈవోపీఆర్డీ రమణ కోరారు. సమావేశంలో జడ్పీటీసీ సభ్యురాలు అప్పికొండ సరస్వతి, ఎంపీడీవో రత్నం, ఎంఈవో ఆమిటి తిరుమల ప్రసాద్, ఐసీడీఎస్ పీవో వరహాలమ్మ, హౌసింగ్ ఏఈ మత్స వెంకటేష్, ట్రాన్స్‌కో ఏఈ సత్యనారాయణ, రామభద్రపురం పీహెచ్‌సీ వైద్యాధికారి దిలీప్ పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులు ఉద్యమాలను ఆపలేవు


పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

రామభద్రపురం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అక్రమ అరెస్టులు ఉద్యమాలను ఆపలేవని యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు ప్రసన్నకుమార్ అన్నారు. సోమవారం బూసాయవలస పాఠశాలలో యూటీఎఫ్ రణభేరి పోస్టర్‌ను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల ముందు రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చి నేటికీ అమలు చేయకపోవడం విచారకరమన్నారు. రణభేరి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, జిల్లా ముఖ్య నాయకులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో హెచ్ఎం చెల్లూరి ప్రసాద్, ఉపాధ్యాయురాలు కందుల కామేశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపు ఆటో కార్మికుల బంద్

బొబ్బిలి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం వల్ల నష్టపోయిన ఆటో కార్మికులకు రూ.25 వేలు చెల్లించాలని సీఐటీయూ అధ్యక్షుడు పి.శంకరరావు డిమాండ్ చేశారు. ఈ నెల 17న జిల్లావ్యాప్తంగా ఆటోల బంద్ చేపడుతున్నట్టు వెల్లడించారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని ఆటో స్టాండ్‌లో సోమవారం అందుకు సబంధించిన వాల్ పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు బీటీఆర్ మోహన్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

గురజాడ జయంతిని అధికారికంగా నిర్వహించండి


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న జిల్లా పౌరవేదిక అధ్యక్షుడు బాబ్జీ

బొబ్బిలి, సెప్టెంబరు15 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సంఘసంస్కర్త గురజాడ అప్పారావు జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఉత్సవంగా నిర్వహించాలని జిల్లా పౌరవేదిక బృందం కోరింది. వేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ నాయకత్వంలో పలువురు ప్రతినిధులు సోమవారం బొబ్బిలి కోటలో ఎమ్మెల్యే బేబీనాయనను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాబ్జీ మాట్లాడుతూ ఈ ఏడాది ఏప్రిల్ 10 రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబరు 689లో ప్రముఖులు జయంతి, వర్థంతులను రాష్ట్ర వేడుకలుగా జరుపుకోవాలని నిర్ణయించారన్నారు. ఈ జాబితాలో జిల్లాకు చెందిన గురజాడ అప్పారావు పేరులేకపోవడం జిల్లా ప్రజలను మనస్తాపానికి గురిచేసిందన్నారు. ఈ నెల 21న గురజాడ అప్పారావు 163 వ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర ఉత్సవంగా ప్రకటించి అధికారికంగా నిర్వహించాలని కోరారు. జిల్లా వాసుల డిమాండ్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లాలని విన్నవించారు. జిల్లా మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌తో పాటు అందరూ ఎమ్మెల్యేలను కలిసి ఈ వినతిపత్రాలను అందజేయనున్నామన్నారు. కార్యక్రమంలో పౌర వేదిక వర్కింగ్ ప్రెసిడెంట్ పిడకల ప్రభాకరరావు, ఇప్పలవలస గోపి, తుమ్మగంటి రామ్మోహనరావు, తాత్రాజు రాజారావు, బోర రమేష్ పాల్గొన్నారు.

అందరికీ యూరియా పంపిణీ చేస్తాం


కృష్ణాపురం రైతు సేవాకేంద్రంలో ఆర్డీవో

బొబ్బిలి రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): యూరియా సరఫరాపై రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని ఆర్డీవో జి.వి.ఎస్. రామ్మోహనరావు అన్నారు. పారాది, కృష్ణాపురం, ఎం బూర్జవలస గ్రామాల రైతు సేవాకేంద్రాల్లో సోమవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడి అధికారులకు తగు సూచనలు చేశారు. యూరియా సరఫరా నిరంతరం కొనసాగుతుందన్నారు. గ్రామాల వారీగా అధికారులు రైతులకు టోకెన్‌లు ఇస్తున్నారని తెలిపారు. రైతులందరికీ పారదర్శకంగా యూరియా అందేలా ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ప్రతి యూరియా పంపిణీ కేంద్రం వద్ద గ్రామ వ్యవసాయ అధికారి, వీఆర్వో, పోలీసు అధికారి ఉంటూ సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా రైతులతో ఆర్డీవో మాట్లాడారు. ఆయనతో పాటు తహసీల్దార్ శ్రీను ఉన్నారు.

18న జనసేన విస్తృతస్థాయి సమావేశం


మాట్లాడుతున్న గిరడ అప్పలస్వామి

బొబ్బిలి, సెప్టెంబరు15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లోకబంధు రెసిడెన్సీలో 18న జిల్లా స్థాయి జనసేన పార్టీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నట్టు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గిరడ అప్పలస్వామి తెలిపారు. సోమవారం సాయంత్రం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వ హయాంలో 16 నెలల పాటు జరిగిన అద్భుతమైన పాలనను సమీక్షించుకుంటూ జిల్లాలో పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చిస్తామన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ శ్రేణులందరినీ సమాయత్తం చేసుకుని అత్యధిక స్థానాల్లో జనసేన అభ్యర్థులు జయకేతనం ఎగురవేసేలా పార్టీ పెద్దలు దిశానిర్దేశం చేస్తారన్నారు. సమావేశంలో నెలిమర్ల ఎమ్మెల్యే లోకం మాధవి, మాజీ మంత్రి పడాల అరుణ, పార్టీ ముఖ్యులు, కీలక నేతలు పాల్గొంటారని ఆయన తెలిపారు. సమావేశంలో ఏఎంసీ డైరెక్టర్ లంక రమేష్, సీనియర్ నాయకులు పెద్దింటి మనోజ్‌కుమార్, అడబాల నాగేశ్వరరావు, గంగాధర్, కొట్టేడ సురేష్, పైల హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యం కోసమే ..

బొబ్బిలి రూరల్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మెరుగైన ఆరోగ్య సేవల ద్వారా మహిళలు, చిన్నారులకు సాధికారత కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని పిరిడి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రఘువంశీ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించాలని కోరుతూ ఎమ్మెల్యే బేబీనాయనను సోమవారం వైద్యుల బృందం ఆహ్వానం పలికింది. ఆయనతో పాటు డీపీఎంవో డా.రవికుమార్, డా.వెంకట్ పాల్గొన్నారు

●బొబ్బిలి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యకరమైన మహిళలు, బలమైన కుటుంబాల కోసం 17 నుంచి స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని అన్ని పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, సబ్‌సెంటర్లలో నిర్వహించనున్నట్టు స్థానిక సీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ గేదెల శశి భూషణరావు తెలిపారు. అసంక్రమిత వ్యాధుల కోసం మహిళలకు స్క్రీనింగ్ పరీక్షలు చేపడతామన్నారు.

దేశాభివృద్ధిలో ఇంజనీర్ల పాత్ర కీలకం

రామభద్రపురం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): దేశ నిర్మాణం, అభివృద్ధిలో ఇంజనీర్ల పాత్ర కీలకమని కారుణ్య ఫౌండేషన్ చైర్మన్ జేసీ రాజు అన్నారు. నాయుడువలస సచివాలయంలో సోమవారం జాతీయ ఇంజనీరింగ్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచమే మెచ్చిన ప్రఖ్యాత ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్యకు నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా ఇంజనీరింగ్ అసిస్టెంట్ రాజశేఖర్‌ను సత్కరించారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ రామరాజు, వెల్ఫేర్ అసిస్టెంట్ రామకృష్ణ, మహిళా పోలీసు మాలతి, ఏఎన్ఎం భవాని తదితరులు పాల్గొన్నారు.

వాహనమిత్రను వినియోగించుకోండి

బొబ్బిలి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆటో కార్మికుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ. 15 వేలను వాహనమిత్ర పథకం కింద అందజేయనుందని, దాన్ని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని పట్టణ టీడీపీ అధ్యక్షుడు గెంబలి శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 17లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆటో డ్రైవర్లకు సూచించారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ


మాట్లాడుతున్న డెప్యూటీ ఎంపీడీవో

బొబ్బిలి రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సుస్థిర అభివృద్ధిని సాధించే దిశగా పంచాయితీలు పనిచేయాలని డిప్యూటీ ఎంపీడీవో అల్లు భాస్కరరావు అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీలు, సర్పంచ్‌లకు సుస్థిర అభివృద్ధి, లక్ష్యాలపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అమలయ్యేలా పంచాయతీలు ప్రణాళికలు రూపొందించాలన్నారు. కార్యక్రమంలో బాడంగి ఎంపీడీవో రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రమాదమని తెలిసినా.. ఆగని రాకపోకలు


కాజ్‌వేను దాటుతున్న జీపు

మక్కువ రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుగ్గేరు సమీపంలోని అడారిగెడ్డ కాజ్‌వే మీదుగా మూడు రోజులుగా వరదనీరు ఉధృతం ప్రవహిస్తోంది. ప్రత్యామ్నాయం లేకపోవడంతో మక్కువ, సాలూరు మండలాలకు చెందిన దాదాపు 20 మైదాన, గిరిశిఖరి గ్రామాల గిరిజనులు ప్రమాదకర పరిస్థితిలో ఆ వరదనీటిలో నుంచే రాకపోకలు సాగిస్తున్నారు. గత నెలలో ఇదే కాజ్‌వేపై జారిపడి ఇద్దరు వ్యక్తులు గెడ్డలో కొట్టుకు పోయారు. గుంటభద్ర గ్రామస్థులు ఆదుకోవడంతో వారు ప్రాణాపాయం నుంచి త్రుటిలో తప్పించుకున్నారు. కాజ్‌వే మీదుగా ప్రస్తుతం పెద్దఎత్తున వరద ప్రవహిస్తున్నప్పటికీ వాహనాలు సైతం ప్రమాదకర స్థితితో రాకపోకలు సాగిస్తున్నాయి. ఈ సందర్భంగా ఎంపీడీవో అర్జునరావు మాట్లాడుతూ కాజ్‌వేపై వరదనీరు తగ్గేవరకు గిరిజనులెవరూ గెడ్డ దాటి వెళ్లవద్దని సూచించారు.